## ఇండియన్ బ్యాంక్ నూతన మేనేజర్‌కు ఘన సన్మానం



తొలి సమయం కొత్తగూడ 27 మే 2026

కొత్తగూడ మండల కేంద్రంలోని ఇండియన్ బ్యాంక్ శాఖకు నూతన మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన కంజర్ల సురేష్‌ను బానోతు అశోక్ మరియు హరిలాల్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బానోతు అశోక్, హరిలాల్ మాట్లాడుతూ కంజర్ల సురేష్ గతంలో 2012 నుంచి 2014 వరకు ఇదే ఇండియన్ బ్యాంక్ శాఖలో క్యాషియర్‌గా విధులు నిర్వహించారు. ఆ సమయంలో ఆయన ఖాతాదారులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, వినయపూర్వక సేవలతో మంచి గుర్తింపు పొందారు. అనంతరం పదోన్నతితో చెన్నై కిల్పేంతూర్ బ్రాంచ్‌లో మేనేజర్‌గా సేవలందిస్తూ, బ్యాంకింగ్ రంగంలో విశేష అనుభవాన్ని సంపాదించారు. తాజా బదిలీల ప్రక్రియలో భాగంగా తిరిగి కొత్తగూడ శాఖకు మేనేజర్‌గా రావడంతో స్థానిక ఖాతాదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఖాతాదారులు మాట్లాడుతూ, సురేష్ గతంలో పనిచేసిన సమయంలో ఖాతాదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంతో పాటు అందరికీ అందుబాటులో ఉండేవారని గుర్తు చేసుకున్నారు. ఆయన మళ్లీ కొత్తగూడ శాఖకు రావడం బ్యాంకు సేవల మెరుగుదలకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించాలని కోరారు. నూతన బాధ్యతలు స్వీకరించిన సురేష్ మాట్లాడుతూ, ఖాతాదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా సేవలు అందిస్తానని తెలిపారు. బ్యాంకు అభివృద్ధితో పాటు ఖాతాదారుల సౌకర్యాలకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఖాతాదారులు బానోతు హరిలాల్, బానోత్ అశోక్ తదితరులు పాల్గొని నూతన మేనేజర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఇల్లందులో టీడీపీ వర్చువల్ మహానాడు



తొలి సమయం, ఇల్లందు, మే , 27:

టీడీపీ నాయకుడు ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో ఇల్లందులో వర్చువల్ మహానాడు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. మహానాడులో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయింపు, మహిళా భద్రత, మహిళా సాధికారతపై ప్రత్యేక తీర్మానాలు చేశారు. జాతీయ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన నారా లోకేష్ ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలో కూడా పార్టీని బలోపేతం చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చాందావత్ రమేష్ బాబు, అజ్మీర బూలి, నాయకులు పుచ్చకాయల సత్యనారాయణ, మనుబోతుల నర్సన్న, మైపా బాలరాజు, అజ్మీర హరి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికీ వర్గీకరణ లేకుండా ఏకకాలంలో పెన్షన్లు అందించాలి

**- జూన్ రెండు కోసం ఎదురుచూస్తున్న ఆసరా లబ్ధిదారుల ఆశలపై నీళ్లు చల్లద్దు 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ విజ్ఞప్తి**



తొలిసమయం, కొత్తగూడెం, మే 27 :

జూన్ 2 న నూతన ఆసరా పెన్షన్ల పంపిణీ కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల ఆశలపై నీళ్లు చల్ల వద్దని 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం డివిజన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో మునిగడప పద్మ మాట్లాడుతూ మీడియాలలో వస్తున్న సమాచారాన్ని బట్టి చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా లక్షల్లో ఆసరా పెన్షన్ దరఖాస్తులు ఉన్నాయని, కేవలం రెండు లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటనలు చూస్తున్నారని ఆమె అన్నారు. అలాగే అర్హులైన వారందరిలో ఏ బి సి వర్గీకరణ ద్వారా కొంతమందికే పెన్షన్లు వస్తాయనే వార్తలను కూడా చూస్తున్నామని దీన్ని బట్టి చూస్తే అర్హులైన వారందరికీ పెన్షన్లు వచ్చేటట్టు నమ్మకం కలగడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్లైన్ సైట్ ఇవ్వకుండా జూన్ 2న సామాజిక పింఛన్లు ఇవ్వడం సాధ్యమేనా ఆమె ప్రశ్నించారు. పెన్షన్ల పంపిణీ కేవలం 5 రోజులు మాత్రమే ఉన్నాయని నేటికీ ఎలాంటి జీవో ఇచ్చినట్టు సమాచారం లేదని అనుమానం వ్యక్తం చేశారు. ఆన్లైన్ కేంద్రాల్లో గాని ,ప్రభుత్వ మున్సిపల్, గ్రామ ఆఫీసులలో గానీ దరఖాస్తులు ఆన్లైన్ చేయమని ప్రజలు కోరుతున్న ఆన్లైన్ సైట్ లేదని వారు సమాధానం చెప్పడాన్ని చూస్తే ప్రజల్లో అనేక అనుమానాలు కలుగుతున్నాయని ఆమె అన్నారు. ఒకవైపు ఇంటింటి సర్వే లో అనర్హుల తొలగింపు పేరుతో కోత విధించే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందని ఈ సర్వేలో అర్హులకు అన్యాయం చేస్తే ప్రజలు సహించరని ఆమె తెలిపారు. ఆసరా పెన్షన్ దారుల లైవ్ ధ్రువీకరణ మే 15 నుండి జూన్ 15 వరకు గడువు ఇవ్వడాన్ని బట్టి చూస్తే ప్రజల్లో అనుమానాలు చక్కర్లు కొడుతున్నాయి ఆమె పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం ఆన్లైన్ సైట్ ను ఇచ్చి జూన్ రెండు లోపు అధికారులు ఎంక్వైయిరీ చేసిన దరఖాస్తులన్నీ ఆన్లైన్లో అప్లోడ్ చేసి అర్హులైన వారందరికీ నూతన ఆసరా పెన్షన్లు మంజూరు చేసి ప్రజా ప్రభుత్వంలో ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు వెయ్యి రూపాయలు, వికలాంగులకు 2000 రూ ..పెంచుతామన్న మాటకు కట్టుబడి లబ్ధిదారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కరుణశ్రీ, లక్ష్మి, మరమ్మ, దేవి ఇతరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారత, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### ఎమ్మెల్యే కోరం కనకయ్య,కొర్లపాటి శివకుమార్

తొలిసమయం,ఇల్లందు,మే, 27:

మహిళా సాధికారత, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బుధవారం ఇల్లందు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన మూడు రోజులకే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని తెలిపారు. ఆరు గ్యారెంటీలలో భాగంగా ఉచిత విద్యుత్, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, రూ.500కే గ్యాస్, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు వంటి పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. జూన్ 2 నుంచి కొత్త పెన్షన్లు, రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు, తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు రూ.5 లక్షల బీమా అమలు చేస్తున్నామని వెల్లడించారు. మహిళలను ఆర్థికంగా



బలోపేతం చేసి కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మన్ పెండేల రాజు, కౌన్సిలర్లు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ప్రతిభావంతుల విద్యార్థులకు మంత్రి సీతక్క సన్మానం



తొలి సమయం కొత్తగూడ 27 మే 2026


కొత్తగూడ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఓటాయిలో పదో తరగతి వార్షిక పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ఘనంగా సన్మానించారు. ఓటాయిలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో విద్యార్థులకు అభినందనలు తెలియజేసి మెమెంటోలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి తమ ప్రతిభను నిరూపించడం ఆనందకర విషయమన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు విలువల ఆధారిత విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాల్లోని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి మంచి విద్యను అందించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ మూర్తి, మండల విద్యాశాఖ అధికారి గుమ్మడి లక్ష్మీనారాయణ, గంగారం మండల విద్యాశాఖ అధికారి, ప్రధానోపాధ్యాయురాలు రామాదేవి, ఉపాధ్యాయులు కోటేశ్వర్, పులసం సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నూతన మండల అధ్యక్షునిగా ఎన్నికైన విష్ణు ముదిరాజ్



శ్రీరంగాపూర్ తొలి సమయం మే 27

శ్రీరంగాపూర్ మండల కేంద్రానికి చెందిన విష్ణు ముదిరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో గత 30 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నందువలన కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం పరిశీలన చేసి నన్ను ఈ రోజు శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా ఎన్నిక చేసిన అందువలన గౌరవ పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, వనపర్తి శాసనసభ్యులు మేఘారెడ్డి, జిల్లా అధ్యక్షులు కొత్త కాపు శివసేన రెడ్డి, ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఆధ్వర్యంలో నాకు శ్రీరంగాపూర్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా అవకాశం ఇవ్వడం వలన వారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియ



జేస్తున్నాను అని వారు మాట్లాడారు. శ్రీరంగాపూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొనడం జరిగింది.

# బిల్లులు ఆపండి

**మోట్ల తిమ్మాపురం నాసిరకం బ్రిడ్జ్ నిర్మాణంపై ఆందోళనకు దిగిన బయ్యారం మండల బీజేపీ**

**కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోకుండా, ఉదాసీనత వహించిన అధికారుల పై చర్యలు తీసుకోవాలి**

**సదర్ కాంట్రాక్టర్ లైసెన్స్ వెంటనే బ్లాక్ లిస్టులో పెట్టాలని కోరిన మొట్ల తిమ్మాపురం సర్పంచ్**

తొలి సమయం బయ్యారం మే 27:

ముట్ల తిమ్మాపురం నాసిరకం బ్రిడ్జి నిర్మాణానికి కారణమైన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవడం లో ఐటీడీఏ అధికారుల ఉదాసీనతపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని. సంబంధిత కాంట్రాక్టర్ లైసెన్స్ ను బ్లాక్ లిస్టులో పెట్టాలని మోట్ల తిమ్మాపురం సర్పంచ్ సాంబయ్య మరియు బయ్యారం మండల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు..మంగళవారం బ్రిడ్జి నాసి రకం నిర్మాణాన్ని బయ్యారం మండలం నాయకులు పర్యవేక్షణ చేశారు ఈ సందర్భంగా సర్పంచ్ తో పాటు నాయకులు మాట్లాడుతూ.. వట్టి వాగు బ్రిడ్జి నిర్మాణం లో బారీ అవినీతి జరిగిందని ఆరోపించారు బయ్యారం బీజేపీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వనం రామారావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం



ద్వారా రెండు కోట్ల నిధులు మంజూరు చేసింది అన్నారు గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ బ్రిడ్జి 2025 మార్చి 20 తేదీన ప్రారంభించి ఏడాది తిరగకుండానే బీటలు వారింది అని నాణ్యత లోపం స్పష్టంగా ఉంది ఆరోపించారు. స్థానిక ఇసుక మట్టిని కలిపి మమ అనిపించారని, నిర్లక్ష్యం ,సాంకేతిక లోకం స్పష్టంగా కనిపిస్తుందని నిప్పులు చెరిగారు ఈ బ్రిడ్జిని రికన్స్ట్రక్షన్ చేయాలని , అందుకు అయ్యే ఖర్చు అవినీతికి పాల్పడిన కాంట్రాక్టర్ భరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సీనియర్ నాయకులు గుగ్గిల కోటయ్య, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి ఊకె రామ్మూర్తి, సీనియర్ నాయకులు రాథోడ్ బాయ్, కార్యకర్తలు దారవత్తు వినోద్, దొర బిజ్జా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి



తొలి సమయం కొత్తగూడ 27 మే 2026

గంగారం మండలం పూనుగొండ్ల గ్రామానికి చెందిన పెనక నారాయణ సమ్మక్క దంపతుల కుమారుడు పెనక సందీప్, నిరోషా వివాహ వేడుకకు ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ శ్రీమతి బడే నాగజ్యోతి జగదీష్ హాజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన దంపతులు ఆనందంగా, ఆయురారోగ్యాలతో జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వివాహ వేడుక ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఇర్ప సూరయ్య, మాజీ సర్పంచ్ గోగ్గల లక్ష్మయ్య, తిరుమలగండి సర్పంచ్ తాటి కృష్ణారావు, పొనుగొండ్ల సర్పంచ్ ఇర్ప సుధాకర్, సీనియర్ నాయకులు ఈసం సమ్మయ్య, వెంకన్న (లోడి), దుర్గం నారాయణ, ఈసం నరేష్, ఇర్ప రఘుపతి, మహిళా నాయకురాలు ఈసం రమ, ఈసం రామారావు, మహేష్, గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఐకేపీ వీఓఏలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి: సీఐటీయూ




తొలి సమయం, ఇల్లందు, మే, 27:

ప్రభుత్వం ఐకేపీ వీఓఏలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబి డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకపోతే జూన్ 4 నుంచి ఐకేపీ వీఓఏ ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బుధవారం ఇల్లందు మండల ఐకేపీ వీఓఏ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. మంత్రి, సెర్ఫ్ సీఈఓలు జూన్ 2 నాటికి ట్యాబ్‌లకు రూ.25 వేల ప్రోత్సాహకం, యూనిఫాంలు, రెండు రకాల ఇన్సూరెన్స్‌లు, ఐడీ కార్డులు, జీఓ 58 సవరణ, అర్హులైన వీఓఏలను సీసీలుగా పదోన్నతి వంటి డిమాండ్లు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఆ హామీలను అమలు చేయకపోతే అన్ని సంఘాలతో కలిసి ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నవ్య, ప్రమీల, పృథ్వీ, వసంత,సురేష్,వెంకటలక్ష్మి,ప్రతాప్‌తదితరవీఓఏలు పాల్గొన్నారు.

## వడదెబ్బతో వ్యక్తి మృతి

**ఎండల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్న కార్పొరేటర్ కనుకుంట్ల శ్రీనివాస్**



తొలిసమయం, కొత్తగూడెం, మే 27 :

భద్రాద్రి జిల్లాలో వడదెబ్బ మరణాలు కొనసాగుతున్నాయి. ఎండలో పనిచేసి ఇంటికి తిరిగొచ్చిన ఓ ఎడ్యుకేషన్ కన్సల్టెంట్ నిద్రలోనే మృతి చెందిన విషాద ఘటన కొత్తగూడెం 25 డివిజన్ పరిధిలో చోటుచేసుకుంది. మృతుడు బి. శ్రీనివాసరావు కొత్తగూడెంలోని సన్యాసి బస్తీలో అద్దెకు ఉంటూ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నారు. మంగళవారం పని నిమిత్తం బయటకు వెళ్లిన శ్రీనివాసరావు, సాయంత్రం ఇంటికి వచ్చి స్నానం చేసి నిద్రపోయారు. అయితే తిరిగి లేవలేదు. విషయం తెలుసుకున్న 25వ డివిజన్ కార్పొరేటర్ కనుకుంట్ల శ్రీనివాస్ వెంటనే స్పందించి పోలీసులకి సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ రాకేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వడదెబ్బ కారణంగానే మృతి చెంది ఉంటారని అనుమానిస్తూ, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వరంగల్ లో నివాసముంటున్న మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన స్థానిక కార్పొరేటర్ కనుకుంట్ల శ్రీనివాస్ జిల్లాలో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అత్యవసరం అయితే తప్ప ఎండలో తిరగవద్దని, తరచూ నీరు తాగుతు జాగ్రత్త వహించాలని సూచించారు.